పెంపకము

శ్రీ పిల్లలమఱ్ఱి వెంకటహనుమంతరావు

ఎప్పుడో చిన్నప్పు డల్లరిచేశానని ఎప్పుడూ అల్లాగే ఉంటానని ఎట్లా అనుకుంటారు? అయినా పిల్లలంతా చిన్నతనంలో అల్లరి చేస్తారు. అల్లరి చేస్తేనే ముద్దూ,మురిపెమూ! లేకపోతే, బెల్లంకొట్టిన రాయిలాగా కూచుంటే ఎవ్వరూ దగ్గిరికి తీయరు సామాన్యంగా. చిన్నప్పుడు ఏపనిచేసినా చక్కగానే ఉంటుంది. తప్పైనా మన పెద్దవాళ్లు నవ్వి ఊరుకుంటారు. అంతే! దాంతో చనవు ఎక్కువయిపోతుంది గారాబం పెరిగిపోతుంది. చివరికి పెద్దయినా వదలదు. అప్పుడు దెబ్బతింటాం. మగపిల్లలైతే పెద్దయినా అల్లరిగా ఉంటే ఫరవాలేదు. కాని ఆడపిల్లల కొస్తుంది ఎక్కడ లేని గొడవానూ. ఏం? మేము మటుకూ ఏంలోపం చేశాము ప్రపంచానికి? ఊహ తెలియకముందట్నుంచే ఎవరికో భయపడాలి. స్వేచ్ఛ అంటే పోతుంది. పది ఏళ్లు కూడా రాకమునుపే, నవ్వితే తప్పు, వాకిట్లోకి వెళ్లితే తప్పు, గట్టిగా మాట్లాడితే తప్పు. ప్రతిదీ తప్పే. అదే ఆ యీడు మగపిల్లవాడైతే చెల్లుతుంది! ఏమి టీఅన్యాయం? నిజంగా లోకమంటే ఏమిటో సరిగా తెలియని స్థితిలో నిర్బంధా లేమిటి? అర్థంలేని నిర్బంధాలు!

మొత్తానికి నాకు పేరు వచ్చేసింది. ఎట్లా పోతుంది? చిన్నప్పు డల్లరిచేసేదాన్నిట—మా అమ్మ చెబుతూ ఉంటుంది. ఉండొచ్చు. కాని ఆవిడ కొట్టూ వచ్చేది. అదిమటుకు నాకు బాగా జ్ఞాపకం. నేను మళ్లీ ఎదురు తిరిగేదాన్ని. మా నాన్నగారు నిజంగా నాపక్షం వుంటూ ఉండేవారు కాబట్టి నాకు ధైర్యం. ఇంట్లో మా నాన్నా నేనూ ఒకటి; మా అమ్మ ఒక్కత్తే ఒకటి! మా అమ్మకూ నాకూ క్షణం పడేదికాదు. ఆవిడ చెప్పినమాట వినకపోవడం పరిపాటయిపోయింది నాకు. నేను—పోయిపోయి వాళ్లకు పుట్టడంమూలాన నామీద మావాళ్ల కెంతో ప్రేమ. మా అమ్మ "అబ్బో! గారాబపుబిడ్డ!" అని దెప్పుతూ ఉండేది మా నాన్నను!

మొత్తానికి నాకు మా నాన్నమాటంటే గురి అయిపోయింది. మా అమ్మతో వైరంకూడా అలవాటయింది. ఇట్లా ఉండటంలో మా నాన్నతోనే అన్నం తినడం, ఆయన ఇచ్చిన బట్టలేసుకోవడం, ఆయనతోటే సభలకు వెళ్లడం, ఆయన చదువుకుంటూన్న సమయంలో చదువుకుంటూ ఉండడం—ఎదురుగా కూచోని, మొదలైనవన్నీ మా అమ్మకు మంటగా ఉండేవి. ఆవిడగొడవే వేరు!

"మరీ మొగపిల్లవాడివై పోతున్నావు! బొత్తిగా ఇవతలచెంబు తీసి అవతల పెట్టకుండా వచ్చావు. చదువుల సరస్వతి అయిపోతున్నావు. చూడు, సీతమ్మగారి అమ్మాయి ఇంచక్కా తనంత తాను జడవేసుకొంటుంది. నూనె రాసుకోని స్నానం చేస్తుంది, చక్కగా పొన్నెమ్మమాదిరి ఎంతో ముచ్చటగా ఉంటుంది. వాళ్లమ్మకు తోడుగా ఉంటుంది పనిపాటల్లో. పిల్లల్ని సముదాయిస్తుంది. ఎంతో సహాయకారిగా ఉంటుందాపిల్ల! నువ్వున్నావంటే దేనికి? నీ అంటట నువ్వు నీపనులు చేసుకుంటే చాలు! నాకు పదివేలు! తిన్నకంచమే కడుక్కోకుండా పరుగెత్తిపోతావు మీ నాన్నగారితో. బాగా అలవాటు చేశారు. నిన్నని ఏమిప్రయోజనం? రేపొచ్చేవారికి ఏంజవాబు చెబుతారో, నాకైతే జవాబుచెప్పగలిగారుకాని! మరీ అంతగారాబమా? చిన్నపిల్లకు ఇప్పట్నుంచే నేర్పుతున్నారు నామీ దెక్కి మిరియాలు నూరడానికి!" అని ఒకటే సణుగుడు మ అమ్మ! నేను పెడచెవిని పెడుతూ ఉండేదాన్ని.

మా అమ్మవల్లే నేను అల్లరిపిల్లననే వదంతి పుట్టిందని నాగట్టి అనుమానం. ఎందుకంటే, ఆవిడ ఎప్పుడూ అందరికీ వెల్లడిచేయందీ (ఏవిషయమైనా) ఆవిడకు నిద్రపట్టదు. పనిలేకపోయినా పని కల్పించుకోనైనా తనమనస్సులోది ఇతరులకు కక్కరావడం ఆవిడమతం. ఏముంది? ఆ అమ్మ యీ అమ్మకు చెప్పనూ, ఈ

అమ్మ ఆ అమ్మకు చెప్పనూ! మరో అమ్మ ముక్కుమీద వేలేసుకొని 'అప్లాగువమ్మా!' అని ఆశ్చర్యపోవడం. ఇల్లా పాకిపోతుంది విషయం. ఇంతా చేస్తే ఏమీ లేదు మళ్లీ — మొత్తానికి నా పేరు బైటికిరావడం తప్ప.

మావాళ్లు నన్ను గారాబంగా పెంచారు కాబట్టి నాక్కావాల్సినవన్నీ మా నాన్న సమకూర్చేవాడు. కాస్త కలవాళ్లబిడ్డ నవడంచేత నాకు రకరకాల పరికిణీలూ, వోణీలూ ఉండేవి. వాటిదగ్గర వచ్చేది మా అమ్మకూ, నాకూ ఘర్షణ. ఆవిడ ఇచ్చినవి నాకు ఇష్టమయ్యేవి కావు. మా నాన్నగారు నాకిష్టమైనవి తీసుకోమనేవారు. మా అమ్మ అనేది-"ఇక్కడైతే ఇష్టమొచ్చినట్లు జరుగుతుంది. రేపు అక్కడెట్లాగో?" అని. మా అమ్మ పెద్దది కాబట్టి సర్దుకుపోవచ్చు. ఊహుఁ. అందుకనే గోల అయిపోయింది. నిజంగా చూస్తే నా దేమీ తప్పు లేదు. పెంచటం చాతకాకపోవడం ఆవిడదే తప్పు. అది మా నాన్నమీద కోపంచేత నామీద చూపించడంచేత ఇల్లా జరిగిందని నా అభిప్రాయం. గుట్టనేది మా అమ్మకు చాతగాదు.

మా నాన్నగారు నన్ను కోప్పడి ఎరగరు. అందుకనే నే నాయనమాటంటే శిలాశాసనంలాగ భావిస్తాను. నాకు చదువుకోవాలని అభిలాష బాగా ఉండేది. మా నాన్నగారుకూడా మొగపిల్లలు లేకపోవడంచేతనే కాబోలు నన్ను విద్యావతిగా చేయాలని సంకల్పించుకున్నారు. అందుకని పన్నెండేళ్లొచ్చేదాకా బళ్లోకి వెళ్లుతూ వచ్చాను. మా అమ్మకు నేను బళ్లోకి వెళ్లడం ఇష్టమైంది కాదు. "ఇంట్లో సంగీతం చెప్పిస్తున్నామాయెను, చాలదా? ఆడపిల్ల అని ఉందంటే అస్కారంలేకుండా చేస్తారా? చేతికింద కాస్త తోడుగా ఉండొద్దా? చదువులెందుకు? ఊళ్లేలాలా, ఉద్యోగాలు చెయ్యాలా? నే నేం చదువుకున్నానేమిటి? నాకు పెళ్లికాలేదూ? మీరు చేసుకోడం మానేశారా? రేపొచ్చే సంబంధాలు వెనక్కుపోతయ్యా? కాస్త పనీ, పాటా నేర్చుకోని ఉంటే నయంకాని, బళ్లోకి పంపిస్తే ఏమిటి లాభం? వెళ్లొచ్చిందిగా! చదువుకున్నంతమటుకూ చాలు! రోజూ పోట్లాటలు తీసుకురావడం దీనిపనీ, తీర్చడం మనపనీ అవుతున్నది. అంతకన్నా ఇది నేర్చుకున్నది నాకేం కనపడలా!" అని మా అమ్మవాదన.

మా అమ్మ ఎప్పుడూ పని చెప్పేది కాదు నాకు. అందువల్ల నేనేమీ వాటిజోలికి పోయి ఎరగను. అయినా, ఏమీ చెప్పకపోతే చాలనుకునేదాన్ని. లోపలనుంచి పిలిచినా వినపడనట్టు నటిస్తూ వచ్చాను. ఒక్కొక్కప్పుడు ఏమైనా పనిచేయమంటే దాన్ని నాశనం చేయడంమూలాన్ని నా కసలు పనే చెప్పేది కాదు. ఒకమాటు కాఫీ పొయ్యిమీదనుంచి దింపమంది తాను జడవేసుకుంటూ. నేను దింపబోతూ కాళ్లమీద పోసుకున్నా! సీసా గూట్లో పెట్టిరమ్మంటే తొందరలో కింద పడేశాను!— ఇటువంటివి చూసే మా అమ్మ నాకు పనిచెప్పడం మానేసింది! నాకూ నయమే అనుకున్నాను!

నన్నెప్పుడూ పెత్తనాలకు తీసికెళ్లేది కాదు మా అమ్మ. తానైతే ఎప్పుడూ ఎవరో ఒకరింటికి వెళ్లుతుంది. నే నొస్తానంటే వద్దనేది. అల్లరి చేస్తానని ఆవిడకు భయం. నే నల్లరిచేస్తే ఆవిడకు నామర్దా వస్తుందనికాబోలు! తను నన్ను గురించి చెప్పుకుంటే రాదుకామోసు! నిజంగా ఆవిడ నన్ను తనతో తీసికెళ్తూఉంటే ప్రపంచంసంగతి తెలుస్తుంది. తోటిపిల్లలెట్లా ఉంటున్నారో గ్రహించడానికీ, పొగతాయింపుతనాన్ని నేర్చుకోవడానికీ అవకాశాలుండేవి. ఏవూరికివెళ్లినా మా నాన్నగారిదగ్గరే ఉంచి వెళ్లుతూ ఉండేది. నేను మా బంధువులెవరినీ ఎరగను. ఇది ఎక్కడైనా కద్దా? కన్నపిల్లను ఇంట్లో అట్టే పెట్టిపోవడం! తల్లి వెళుతూంటే పిల్లను తీసికెళ్లదూ? అదేమిటంటే, "అల్లరిపిల్ల—నే చెప్పిన మాట వినదు. నలుగురిలో నగుబాట్లు!" అని ఊరుకుంటుంది! ...... ఇంతకూ నా ఖర్మ అల్లా ఉంది. ఒకరన్నంటే ఏంలాభం?

* * *

పెళ్లి సంబంధాలొచ్చాయి. అందరూ చదువూ సంగీతం చూసేవాళ్లేగాని పనీ పాటా అడగలేదు. మా నాన్నే గెలిచాడు...... మొత్తానికి నా పెళ్లి కావడం మటుకు సంగీతం చూసే అయింది. అందాకా

ఎందుకు ? నా అదృష్టమే అనుకోవాలి! మా అమ్మ భయానికి తావు లేకుండాపోయింది. అదీ నాక్కావాల్సింది.

*   *   *

అవి మొదటిదినాలు కాబట్టి అట్టే నా కేమీ పని తగిలేదికాదు అత్తవారింట్లో. అదీగాక నన్ను ఆ ఇల్లాలు తన ఆడపిల్లలాగా చూచుకునేది. తనకూ ఒక్క మొగపిల్లవాడే మిగలటాన నన్నంత రొష్టు పెట్టి ఎరగదు, పాపం! చక్కగా ఇద్దర్నీ రెండుకళ్ల మాదిరి చూసుకుంటూ వచ్చింది. నా కామె అంటే ఎంతో ఆపేక్ష కలిగింది. మా నాన్నగారి తర్వాత అంత చనువుగా, ఆపేక్షతో దగ్గిరికి తీసినవారులేరు. మా అమ్మ పేరు తలుచుకుంటే భయమేసేది. ఎందుకు? ఆవిడ ఎప్పుడూ నాతో సంతోషంగా ఉండలేదు కాబట్టి.

పెళ్లికాకముందు ఆగొడవా — అయింతర్వాత అల్లుడుమీద కోపం నామీద చూపించడం! నాతో ఎన్నంటే ఏంలాభం ? నేనైతే ఎవ్వరికీ ఏమి మాటలూ చెప్పేదాన్నికాదు. మరెన్య నాకెందుకు ఆగొడవ ? కాని, మా అమ్మమటుకు ఒక్కమాటు నాతో ఎన్నడూ లేని ఆప్యాయంతో మాట్లాడింది. అది మా అత్తవారింటికి వచ్చేటప్పుడు. నిజంగా ఆక్షణం నాకు ఆశ్చర్యం, కన్నీరూ ఒక్కమాటుగా వచ్చాయి. కన్నకడుపంటే అల్లా ఉంటుందని కామోసు. నాకూ—ఆవిడ చిన్నప్పటినుంచీ ఎన్నన్నా--ఓవిన మైన జాలికలిగింది ఆవిడమీద. నేను మా అత్తవారింటికి వచ్చేస్తే ఆవిడకు సందడేదీ? నిజమే! ఆవిడ అన్న ముక్కలన్నీ సత్యమే... కాని నన్ను ఎందుకు అట్లా రాపాడేది ?

చూసినవాళ్లంతా నన్ను "వాళ్ల నాన్న పోలికమ్మా! వట్టి బోళామనిషి. గర్వంలేదు. నిజంగా నీ వదృష్టవంతురాలవమ్మా!" అనేవాళ్లు మా అత్తగారితో......మా అత్తగారు నాకు మొదట్లోనే చెప్పేది ఏమేమిటో...అంటే, ఎవరితో ఎల్లా మాట్లాడాలో అన్నీను. ఆ తర్వాత నేనూ, ఆవిడా కలిసి ఎక్కడికైనా--ఎవరింటికి పేరంటానికైనా--వెళ్లేవాళ్లం. నిజంగా నేర్పితే మటుకు నేను బుద్ధిమంతురాలను కానూ!

ఆలోపం మా అమ్మది కాని. మెల్లిగా పనులన్నీ చేయడం చాతయినై. పుట్టుతూనే రమ్మంటే వస్తాయా ? వాటిని చేయించే పద్ధతికూడా తెలియాలి తల్లికి. ఊరికే కొట్టడమే అయితే పనులు ఎట్లా నేర్చుకునేది? మా అత్తగారికి ఆవిధానాలన్నీ బాగా తెలుసు కాబట్టే నాలోపా లేమీ బయటివాళ్లకు తెలియనీకుండా, గుంభనగా, నాకు పనీ పాటా నేర్పించింది క్రమేపీ. ఆవిడ మంచిది కాబట్టి అంత శ్రద్ధ తీసుకుంది. ఇంకొరైతే "పనులు నేర్పి పంపండి" అని పుట్టింటికి పంపించి నానాగోలా చేసేవారు. ఇంతకూ మా అత్తగారు మంచిది.....పద్ధతులన్నీ తెలుసు ... అక్కడికి వెళ్లింతర్వాతనే నే నింతబుద్ధిమంతురాలనయింది !

*   *   *

మా అమ్మకు ఆశ్చర్యం కలిగింది, ఆవిడ మా యింటికి వచ్చేటప్పటికి నేను పనిచేస్తూండడం చూసి. "ఈపనంతా ఎక్కడ నేర్చుకున్నావే తల్లీ! నే నొక్కటైనా నేర్పలేదు. ఇదంతా అత్తవారనేసరికి వచ్చేస్తుందిగామోసు. నామాట వినసైనా వినేదానివికాదు ! ఇంత బుద్ధిమంతురాల వౌతా వనుకోలేదు."

ఆరాత్రి మాపక్కగదిలో వియ్యపురాండ్ర గుసగుసలు వినపడినై. పొద్దు పొయ్యేదాకా ఏమిటో రహస్యాలు? నేను విందామని ప్రయత్నించాను. మా అమ్మే ఎక్కువగా చెపుతున్నది ఆవిడ సంతోషం కొద్దీ.

"ఇదెంత దైందమ్మా...వాళ్ల నాన్నగారిమాదిరి బోళామనిషైనా వాళ్లాయన రహస్యాలు బైట చెప్పడు. ...మహాగుట్టు. ఎంతో పొందికా, మర్యాదా నేర్చుకున్నదమ్మా. వదినెగారూ! ఇదంతా మీచలువే సుమా."

"బాగుందమ్మా....! మా ఇంటిపిల్ల అయింతర్వాత మాగుట్టు బయటపెట్టుం దేమిటి?"

"అయినా — మీమీదే ఎక్కువ ఆపేక్ష కొర్నాసికి...వాళ్లత్తగారు మంచిదిట....చక్కగా చూసుకొంటుందిట....చూశారా అమ్మా. ఇన్నాళ్లు పెంచినా మేము ఉత్తవాళ్లమేగా......"

"మాకు మటుకూ వాళ్లే కదండీ! అమ్మాయి మధ్యాహ్నంవేళల పుస్తకాలు చదివి వినిపిస్తూ ఉంటుంది. సంగీతం పాడుతూ ఉంటుంది. చక్కగా వాళ్లిద్దరూ వెయ్యికాలాలపాటు బాగుంటమే మనకు కావాల్సింది!"

మర్నాడు ఉదయం పంచపాళీలో నుంచున్నాను. మాఅమ్మ ప్రయాణమైంది.... నాదగ్గరకువచ్చి చెక్కిళ్లు దువ్వి, "అమ్మాయీ! వెళ్లొస్తానమ్మ — ఉత్తరం రాస్తూఉండు" అంది.

తల ఊపుతూ కనుచూపుమేర దాటి పొయ్యే బండిని చూస్తూ నిలబడ్డాను.

అల్లరిపిల్ల అనే పేరు మాసిపోయిందిగా అని నాసంతృప్తి ... అదంతా మాఅమ్మ అమాయికపు పెంపకంవల్లనే అని నా దృఢాభిప్రాయం ఇప్పటికీ.

గనోరియాకు ఆధుని చికిత్స



నేటి సుప్రసిద్ధ దివ్యౌషధము

ఇంగ్లీషు మరియు యితర నాటువైద్యములకు మీ చర్మము నివారణవ్యాధి కాక పుచ్చుకొన్న యింజెక్షన్లు నిష్ప్రయోజనమై యుండినయడల మేము తయారుచేసిన నేటి "గోనోకిల్లర్"ను వాడిచూడుడు. ఈ సుప్రసిద్ధమందు అన్నివిధముల చర్మబాధలను శీఘ్రకాలములో తొలగించి మీకు సౌఖ్యమునిచ్చును. యిది, స్త్రీ **పురుషులయొక్క,** మూత్రజాడ్యములకును చీముతోగూడిన వివిధ రకముల **గనేరియా-మేహరోగము,** తెలుపుపోవుట, వాపు, వీర్యముపోవుట, పొక్కులు యీ మొదలయినవి దీనివలన నివారణయగును. వేలకొలది జనులు మా మందును వాడి సౌఖ్యము పొందినారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులు యానందించినారు. కాలము పోగొట్టక మీరు యీమందును వకసారి వుపయోగించి యానందము పొందండి. 50 మాత్రల బుడ్డి యొకటికి రూ. 3/-మాత్రమే. వి. పి. పి. ప్రత్యేకము అణాలు 8.

Sole manufacturer:—**Dr. D N. JASANI,**
(Dpt. B. H. M) Vithalbhai Patel Road Bombay No. 4.

Madras Agent
APPAH & CO.,
China Bazaar,